క్లుప్తంగా

ఎంపీడీఓగా రియాజొద్దీన్



టేక్మాల్(మెదక్): ఎంపీడీఓగా రియాజొద్దీన్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఎంపీడీఓగా పనిచేసిన విఠల్ కొల్చారం మండల సూపరిటెండెంట్‌గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ పథకాలు అందరికి అందేలా కృషి చేస్తానన్నారు. మండలాబివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

లక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవం



లక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవం

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో కల్యాణోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శనివారం లక్ష్మీనర్సింహస్వామి జన్మ నక్షత్రం స్వాతి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, కల్యాణోత్సవం చేపట్టారు. లోక కల్యాణార్థం వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు పాడిపంటలతో సంతోషంగా ఉండాలనే సంకల్పంతో పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు ధనుంజయ్ శర్మ అన్నారు. కార్యక్రమంలో ఈఓ శశిధర్, సిబ్బంది ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలు తప్పనిసరి



చిలప్‌చెడ్(నర్సాపూర్): ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న హౌసింగ్ ఏఈ అరుణ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు తప్పనిసరిగా నిర్మాణాలు చేపట్టాలని హౌసింగ్ ఏఈ అరుణ్ అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని అజ్జమర్రి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 18 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేయగా, 15 మంది ఇంటి నిర్మాణాలను ప్రారంభించారని తెలిపారు. కాగా బేస్‌మెంట్ లెవల్ పూర్తయిన నిర్మాణాల కొలతలు తీసుకుని, వాటి ఫొటోలు అప్‌లోడ్ చేశామన్నారు. త్వరలోనే వారికి మొదటి విడత డబ్బులు జమ అవుతాయని పేర్కొన్నారు. కాగా మిగతా ముగ్గురు సైతం ఇంటి నిర్మాణాలు ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పరుశరాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రశాంతి పాల్గొన్నారు.

ఇళ్ల పనుల పరిశీలన

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని మాందాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను ఎంపీడీఓ చంద్రశేఖర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిర్మాణాలను చురుకుగా చేపట్టాలన్నారు. ఇల్లు కట్టుకున్న లబ్ధిదారులకు ప్రభుత్వం వెంటనే బిల్లులు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. విడతలవారీగా బిల్లులు చెల్లిస్తామన్నారు. పనులు మొదలు పెట్టని లబ్ధిదారులు వెంటనే పనులు ప్రారంభించాలని ఆయన సూచించారు.

రాంచందర్‌రావుకు సన్మానం



రాంచందర్‌రావును సన్మానించిన మల్లేశ్‌గౌడ్

నర్సాపూర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రాంచందర్‌రావును ఆ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్ సన్మానించారు. ఆయన వెంట పార్టీ నాయకులు రాజు, రాంలునాయక్, నగేష్ గౌడ్, మహేందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ



ఎంఆర్‌పీఎస్ సభ్యులు

రామాయంపేట(మెదక్): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి పట్టణ కార్యవర్గాన్ని శనివారం రాత్రి ఎంపికయ్యారు సంఘం జిల్లా ఇన్‌చార్జి విజయ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సంఘం అధ్యక్షుడిగా ఎర్ర నరేశ్, అధికార ప్రతినిధిగా ఎర్ర శేఖర్, ప్రధాన కార్యదర్శిగా అశోక్, ఉపాధ్యక్షులుగా రాజు, రామస్వామి, కార్యదర్శిగా చంద్రం, కోశాధికారిగా హంస రాజు, బాబు, శ్రీను, మహేశ్, సిద్దరాంలు, రమేశ్‌ను సలహాదారులుగా ఎంపికయ్యారు. సంఘం సీనియర్ నాయకులు పాతూరి రాజు, లద్ద నర్సింలు, ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు మల్యాల కిషన్, వీహెచ్‌పీఎస్ జిల్లా నాయకులు కుమార్, సంజీవ్ పాల్గొన్నారు.

లక్ష్యం చేరేనా..

- తూతూ మంత్రంగా వనమహోత్సవం
- పలు నర్సరీలలో ఎదగని మొక్కలు
- గ్రామాలలో తీయని గుంతలు



గౌతాపూర్‌లో నర్సరీలో ఎదగని మొక్కలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న వనమహోత్సవ కార్యక్రమం ఈ సీజన్‌లో అనుకున్న స్థాయిలో జరగడం లేదు. ప్రతి గ్రామంలో అనుకున్న లక్ష్యం ఏమోగానీ, కనీస స్థాయిలోనైనా మొక్కలు నాటేలా కనబడటం లేదు. వర్షాకాలం ప్రారంభమై రోజులు గడుస్తున్నా.. పలు గ్రామాలలో ఇప్పటివరకు మొక్కలు నాటేందుకు కనీసం గుంతలు సైతం తీయలేదు. చిలప్‌చెడ్ మండలంలో 19 గ్రామ పంచాయతీలు ఉండగా, ఈ వర్షాకాలం సీజన్‌లో వనమహోత్సవంలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో ఐదు వేల మొక్కల చొప్పున, మండల వ్యాప్తంగా లక్ష మొక్కలు నాటాలని, అనుకున్న సమయానికి వనమహోత్సవ కార్యక్రమం ప్రారంభించాలని ఉన్నతాధికారులు సూచించారు. కాగా ఇప్పటివరకు మండలంలో కేవలం చిట్కుల్, అజ్జమర్రి గ్రామాలలో మాత్రమే స్వల్పస్థాయిలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. మండలంలోని గౌతాపూర్, రాందాస్‌గూడ గ్రామాల నర్సరీలలో సక్రమంగా మొక్కలే ఎదగలేవు. మండలంలోని ఏ గ్రామంలో సైతం పూర్తి స్థాయిలో గుంతలు తీయలేదు. కాగా మిగతా గ్రామాల నర్సరీలలో ఎదిగిన మొక్కలు అన్నీ రోడ్డుకు ఇరువైపులా తప్ప, మిగతా స్థలాలలో నాటేందుకు పనికిరావు. శిఖం భూములలో, చెరువు కట్టలపై నాటే మొక్కలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. నర్సరీలలో ఇంటి ఆవరణలో నాటేందుకు సరైన పండ్ల, పూల మొక్కలు లేవు. దిగిన మొక్కలను సైతం అధికారులు ఇప్పటివరకు ఇంటింటికి మొక్కల పంపిణీ చేయలేదు. చేసిన ఆ మొక్కలను పెంచుకోవడానికి ఎవరూ ఇష్టపడటం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో వనమహోత్సవ లక్ష్యాన్ని ఏ విధంగా పూర్తి చేస్తారని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

మొక్కల పంపిణీ చేయలేదు



ప్రతి వర్షాకాలం సీజన్లో గ్రామాలలో ఇంటింటికి ఆరు మొక్కలు పంపిణీ చేసేవారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు మొక్కలు పంపిణీ చేయలేదు. గ్రామంలోని నర్సరీలో ఏ మొక్కలు ఉన్నాయో తెలియదు. ఇంటింటికి పంపిణీ చేసే మొక్కలలో. పండ్లు, పూల మొక్కలు ఉంటే పెంచుకోడానికి ఆసక్తి ఉంటుంది. సుబాబు, కోనోకార్పస్ లాంటి జాతి మొక్కలు పంపిణీ చేయాలనుకుంటే, వాటిని ఇవ్వడమే వృథా.

\- కర్రోల హన్మంతు

అనుకున్న లక్ష్యాన్ని పూర్తి చేస్తాం



మండల గ్రామాలలో మొక్కలు నాటేందుకు ఉపాధి కూలీలతో గుంతలు తీయిస్తున్నాం. పలు గ్రామాలలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటుతున్నారు. ఏదేమైనా అనుకున్న సమయానికి లక్ష్యాన్ని పూర్తి చేస్తాం. ప్రత్యామ్నాయంగానైనా ఇంటింటికి పండ్లు, పూల మొక్కలు పంపిణీ చేస్తాం. నర్సరీల పట్ల నిర్లక్ష్యం వహించిన వారిపై చర్య తీసుకుంటాం.

\- శ్యామ్, ఏపీఓ

హైవేపై గుంతతో ఇబ్బందులు



జాతీయ రహదారిపై ఏర్పడిన గుంత వద్ద ఏర్పాటు చేసిన స్టాపర్ (దాని కింద గుంత)

నర్సాపూర్: హైవేపై ఏర్పడిన గుంతతో వాహనదారులు ఇబ్బందుల పాలవుతున్నారు.జాతీయ రహదారి నిర్వహణ సరిగా లేనందునే రోడ్డుపై గుంతలు పడినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. చాలా నెలల క్రితం నర్సాపూర్ పట్టణంలోకి వచ్చే మూల మలుపు వద్ద జాతీయ రహదారిపై గుంత ఏర్పడింది. మున్సిపల్ అధికారులు సిమెంటు, కంకరతో గుంతను తాత్కాలికంగా పూడ్చే పనులు చేపట్టారు. కాగా గుంతపై నుంచి వాహనాలు వెళ్లడంతో గుంతను పూడ్చిన సిమెంటు కంకర కొట్టుకుపోవడంతో మళ్లీ గుంత ఏర్పడింది. ఇటీవల వర్షాలు కురువడంతో గుంతలో నీరు నిలిచి గుంత ఎంత లోతు ఉందో తెలియక వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. కాగా గుంత వద్ద స్టాపర్ పెట్టి గుంత పక్క నుంచి వాహనాలు వెళ్లే విధంగా చేశారు. రహదారిపై యూ టర్న్ తీసుకునే వాహనదారులు స్టాపర్‌తో చాలా ఇబ్బందులు పడుతున్నారు. హైవేపై ఏర్పడిన గుంతకు శాశ్వత మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు స్వప్న

మనోహరాబాద్(తూప్రాన్): వర్షాకాలం కావడంతో గ్రామాలలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, కాచి చల్లార్చిన తాగునీటిని తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యులు స్వప్న సూచించారు. శనివారం మండలంలో దండుపల్లి వద్ద గ్రామస్తులకు ప్రత్యేక శిబిరం ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కొండాపూర్ గ్రామంలో ఎఎన్‌ఎంలు వరలక్ష్మీ, స్వర్ణల ఆధ్వర్యంలో, పల్లె దవాఖాన వైద్యుల ఆధ్వర్యంలో వారి సెంటర్లలో వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్‌ఎం రాధ, పంచాయతీ కార్యదర్శులు హేమలత, సంతోష్, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి

తపస్ మండల అధ్యక్షుడు రవి



తపస్ అధ్వర్యంలో సభ్యత్వ నమోదు

పెద్ద శంకరంపేట(మెదక్): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) కృషి చేస్తుందని మండల అధ్యక్షుడు జి.రవి అన్నారు. శనివారం ఆయా పాఠశాలలో సభ్యత్వ నమోదును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుని నియమించాలని, నగదు రహిత ఆరోగ్య పథకాన్ని అమలు చేయాలని, జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్‌సీలను వెంటనే ప్రకటించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు సమ్మె కాలపు వేతనాన్ని, మోడల్ స్కూల్ ఉద్యోగులకు 010 కింద వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తపస్ మండల ప్రధాన కార్యదర్శి కాన్షీరాం జాదవ్, సత్య కుమార్, లక్ష్మణ్, బేతయ్య, ప్రవీణ్ కుమార్, ఉదయ్,ప్రవీణ్, గోపాల్‌లు పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం తగదు

సీడీపీఓ హేమభార్గవి



పిల్లల బరువును పరిశీలిస్తున్న హేమ భార్గవి

నర్సాపూర్ రూరల్: విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని నర్సాపూర్ ప్రాజెక్ట్ సీడీపీఓ హేమభార్గవి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను హెచ్చరించారు. శనివారం నర్సాపూర్ మండలంలోని రుస్తుంపేట, నాగులపల్లి, మూసాపేట కేంద్రాలను సందర్శించారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లల బరువును స్వయంగా కొలతలు వేసి పరిశీలించారు. నారాయణపూర్, గొల్లపల్లి, లింగాపూర్, విఠల్ తండా, తిరుమలాపూర్, అంగన్ వాడి కేంద్రంలో సూపర్‌వేజర్లు సరళ కుమారి, లక్ష్మీనరసమ్మ, సంతోషిమాత, లక్ష్మి, సుజాతలు సందర్శించి పిల్లల బరువులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తూ పిల్లల బరువు తగ్గకుండా చూడాలని సూచించారు. గర్భిణి, బాలింత మహిళలకు రక్తహీనత లేకుండా వారికి తగు సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు.

పిల్లల సంపూర్ణ అరోగ్యమే లక్ష్యం



పిల్లల ఎత్తును పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ సరళకుమారి

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లల గ్రోత్‌మానిటరింగ్‌పై ఐసీడీఎస్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. శనివారం నర్సాపూర్ మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సరళకుమారి, లక్ష్మీనర్సమ్మ మండల కేంద్రమైన కౌడిపల్లిలోని 3, 4వ అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. పిల్లలలో వయసుకు తగ్గ ఎత్తు, ఎత్తుకు తగ్గ బరువు ఉంది, లేనిది కొలతలు తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. అందులో భాగంగా స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి పిల్లల ఆరోగ్యం, ఎత్తు, బరువు కొలతలు తీస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుమిత్ర, రజియసుల్తానా, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

తూప్రాన్‌లో భారీ ర్యాలీ



కాన్వాయ్‌లో రవీందర్‌గుప్తా, నర్సారెడ్డి, రాజిరెడ్డి, ఆంక్షారెడ్డి తదితరులు

తూప్రాన్: నాచారం లక్ష్మి నర్సింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్ రవీందర్‌గుప్తా ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పట్టణంలోని అయ్యప్ప దేవాలయం నుంచి నాచారం లక్ష్మినర్సింహస్వామి ఆలయం వరకు సుమారు వందకు పైగా వాహనాలతో భారీ కాన్వాయ్ నిర్వహించారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు అంక్షరెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి, ఫుడ్ కమిటీ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డికి అనుకూలంగా నినాదాలు చేశారు.

సహకార సేవలను సద్వినియోగం చేసుకోవాలి

శివ్వంపేట(నర్సాపూర్): సహకార సంఘాల ద్వారా అందుతున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ ఇన్‌చార్జి రాజిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకటరామిరెడ్డి కోరారు. శనివారం అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ చేసి మొక్కలు నాటారు. సహకారం సంఘం ద్వారా రైతులు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉంచడంతో పాటు బ్యాంకు రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ మధుకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు నవీన్‌గుప్తా, మాధవరెడ్డి, కమలపూల్‌సింగ్, గణేష్, ప్రభులింగంగౌడ్, అంజిరెడ్డి, అరుణ్‌కుమార్, శ్రీనివాస్, సీఈఓ మధు, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరణ

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట మండల కేంద్రంతో పాటు మడూర్, జంగరాయి, చందంపేట సహకార సంఘాలలో సహకార జెండాను ఆవిష్కరించారు. చిన్నశంకరంపేట సొసైటీ చైర్మన్ అంజిరెడ్డి, మడూర్‌లో శ్రీనివాస్‌రెడ్డి, జంగరాయిలో శ్రీనివాస్‌రెడ్డి, చందంపేటలో సత్యనారాయణ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో సీఈఓలు రమేష్, కృష్ణ, బాలకిష్టయ్య, పాషా పాల్గొన్నారు

పెద్ద శంకరంపేటలో..

పెద్దశంకరంపేట(మెదక్): ప్రాథమిక సహకార కార్యాలయం వద్ద సీఈఓ రవీందర్, డైరెక్టర్ శశిధర్‌రెడ్డి జెండాను ఆవిష్కరించారు. అనంతరం సిబ్బందితో కలిసి మొక్కలను నాటారు. రైతులకు ఎరువులు, తక్కువ వడ్డీకే వ్యవసాయ, ఎల్‌టీ లోన్‌లు, ఇతర వాణిజ్య రుణాలను అందిస్తున్నామని ఆయన తెలిపారు.

చేగుంటలో..

చేగుంట(తూప్రాన్): చేగుంట సహకార సంఘం వద్ద చైర్మన్ బోనగిరి బాగులు జెండాను ఆవిష్కరించి మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో సీఈఓ సందీప్, డైరెక్టర్‌లు రాములు, రఘురాంలు, సిద్ధిరాములు, సత్యనారాయణ, రమేశ్ ఉన్నారు.

జీవామృతంతో భూసారం పెరుగుదల



సేంద్రియ ఎరువుల తయారు చేసి చూపిస్తున్న కేవీకే శాస్త్రవేత్త రవికుమార్

కౌడిపల్లి(నర్సాపూర్): జీవామృతంతో భూసారం పెరుగుతోందని రైతులు ఇంటి వద్ద ఎలాంటి ఖర్చు లేకుండా తయారు చేసుకోవచ్చని కేవీకే శాస్త్రవేత్త రవికుమార్ సూచించారు. శనివారం మండలంలోని తునికి వద్దగల డాక్టర్ డి రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో ఎస్సీ రైతులకు సేంద్రియ, ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవు మూత్రం, ఆవుపేడతో జీవామృతం, ఘన జీవామృతం తయారు చేసి ఎరువుగా వాడాలని తెలిపారు. ప్రతి రైతులు సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. రైతులు పశువులు, ఆవులను పెంచడంవల్ల అదనపు ఆదాయంతోపాటు ఎరువులు లభిస్తుందన్నారు. సేంద్రియ ఎరువులు తక్కువ ఖర్చుతో తయారు చేయవచ్చన్నారు. సేంద్రియ ఎరువుతో భూసారం పెరుగుతుందని, ఆహార పంటలతో ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శోభారాణి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా మాలతి

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట తహసీల్దార్‌గా మాలతి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ మన్నన్ పదవీ విరమణ చేయగా బదిలీపై మాలతి ఇక్కడకు వచ్చారు. నిజామాబాద్ జిల్లా ధరిపల్లి తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమె చిన్నశంకరంపేట తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తానన్నారు.

'సదరం' స్లాట్‌బుక్ చేసుకోండి

చిన్నశంకరంపేట(మెదక్): ఈ నెల 9న మెదక్ ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించే సదరం క్యాంపులో వికలాంగుల ధ్రువీకరణ పత్రం పొందేందుకు అవసరమైన వారు స్లాట్‌బుక్ చేసుకోవాలని నార్సింగి ఎంపీడీఓ ఆనంద్‌కుమార్ కోరారు. ఈ క్యాంపులో శారీరక, చెవుడు, మూగ, మానసిక, దృష్టిలోపం ఉన్న వారు ముందుగా మీ సేవా కేంద్రం ద్వారా స్లాట్‌బుక్ చేసుకోవాలని సూచించారు. బుధవారం నిర్వహించే సదరం క్యాంపులో 55 మందికి పరీక్షలు నిర్వహించనున్నారని, రెన్యువల్ కోసం మరో 30 మందికి అవకాశం ఉందన్నారు.

కార్మికులకు అస్వస్థత

శివ్వంపేట(నర్సాపూర్): నవాబుపేటలోని ఓ కెమికల్ పరిశ్రమలో విధులు నిర్వహించిన కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు శుక్రవారం కెమికల్ పరిశ్రమలోని ప్రొడక్షన్ ప్లాంట్ రియాక్టర్ వద్ద పనిచేశారు. రాత్రి ఇంటికెళ్లాక కార్మికులకు తీవ్ర దురద వచ్చి ఇబ్బందులు పడ్డారు. వారి కుటుంబ సభ్యులు గుమ్మడిదలలోని ఓ క్లినిక్‌లో చికిత్స చేయించారు. పరిశ్రమలోని కెమికల్ ప్రొడక్షన్ వద్ద లీకేజీ వల్ల చర్మ సమస్యలు తలెత్తినట్లు సమాచారం.

సీసీ రోడ్లకు శంకుస్థాపన

నర్సాపూర్ రూరల్: మండలంలోని నత్తయ్యపల్లిలో ఆయా వీధుల్లో సీసీ రోడ్ల ఏర్పాటుకు నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు.

ఆధునిక సాగుపై దృష్టి సారించండి

వ్యవసాయ అధికారిని ర్యూన్సీ



డ్రమ్ సీడర్ పద్ధతిలో విత్తనం నాటే విధానం పరిశీలిస్తున్న ఏఓ ర్యూన్సీ

వెల్దుర్తి(తూప్రాన్): వరి సాగులో రైతులు సంప్రదాయ సాగు విధానాలకు స్వస్తి పలికి ఆధునిక సాగు విధానాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల వ్యవసాయ అధికారిని ర్యూన్సీ అన్నారు. ఈ మేరకు వెల్దుర్తి గ్రామ శివారులో డ్రమ్ సీడర్ పద్ధతిలో వరినాటు వేసిన రైతు తోట నర్సింలు వ్యవసాయ క్షేత్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నారుమడి పద్ధతిలో ఎకరాకు 20 నుంచి 25 కేజీలు విత్తనాలు అవసరమైతే డ్రమ్ సీడర్, వెదజల్లె పద్ధతిలో కేవలం 8 నుంచి 10 కేజీల విత్తనాలు అవసరం అవుతాయని పేర్కొన్నారు. వరినాటు కోసం ఎకరాకు 5 నుంచి 6 వేలు ఖర్చు అవుతుందని అదే డ్రమ్ సీడర్ పద్ధతిలో కేవలం ఒక వ్యక్తితో ఒక్కరోజులో సుమారు మూడు ఎకరాలు విత్తనం వేసుకోవచ్చన్నారు. తద్వారా రైతులకు పంట పెట్టుబడి చాలా తక్కువగా అవుతుందన్నారు. రోజురోజుకూ వస్తున్న మార్పులకు అనుగూనంగా రైతులు ఆధునిక సాగువైపు దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ మజీద్, వందన ఉన్నారు.

శిలాఫలకాలకే పరిమితమైన పద్మారెడ్డి

ఎమ్మెల్యే రోహిత్‌ను విమర్శించడం తగదు



మాట్లాడుతున్న సుప్రభాతరావు

రామాయంపేట(మెదక్): మెదక్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి తన హయాంలో కేవలం శిలాఫలకాలకే పరిమితమయ్యారని పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి విమర్శించారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తాము మంజూరు చేసిన నిధులతోనే ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ శంకుస్థాపనలు చేస్తున్నారని ఆరోపించడం తగదన్నారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్నా.. ఏనాడు పద్మారెడ్డి అభివృద్ధి గురించి పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళుతున్న ఎమ్మెల్యేను విమర్శిస్తే తాము ఊరుకోబోమని హెచ్చరించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.కోట్లు మంజూరు చేయించారని గుర్తు చేశారు. రామాయంపేట అన్ని రంగాల్లో వెనుకబడటానికి బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని వారు ఆరోపించారు. అధికారికంగా రెవెన్యూ డివిజన్ మంజూరు కాకపోయినా, ఎన్నికల ముందు ఓట్ల కోసం కార్యాలయాన్ని ప్రారంభించారని ఎద్దేవా చేశారు.

గిరిజన విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



విద్యార్థులకు వస్తువులు పంపిణీ చేసిన దృశ్యం

పాపన్నపేట(మెదక్): కనీస సౌకర్యాలు లేని గిరిజన తండా పాఠశాల విద్యార్థులకు ఓ మహిళ బ్యాగు లు, పెన్నులు, పుస్తకాలు, వాటర్‌బాటిల్స్ పంపిణీ చేసి తన ఉదారత చాటుకుంది. పాపన్నపేట మండలంలోని అమ్రియా తండాలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న రవీందర్ కోరిక మేరకు అతని సోదరి ప్రమీల తన భర్త బాలకృష్ణ జ్ఞాపకార్థం విద్యార్థులకు అవసరమైన వస్తువులు పంపిణీ చేసింది. తండావాసులు ప్రమీల, ఆమె కూతురు శ్రావణి, హెచ్ఎం రవీందర్‌ను ఘనంగా సన్మానించారు.

నిషేధిత అల్ప్రాజోలం పట్టివేత



ఉత్తులూర్ వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు

పెద్దశంకరంపేట(మెదక్): నిషేధిత ఆల్ప్రాజోలంను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన మండల పరిధిలోని ఉత్తులూర్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఎస్ఐ.ప్రవీణ్‌రెడ్డి వివరాల ప్రకారం.. గ్రామ శివారులో భానుగోని గోపాల్‌గౌడ్ అనుమానాస్పదంగా కనిపించడంతో అతడి వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేశారు. అందులో కల్లులో కలిపే నిషేధిత అల్ప్రాజోలం 38 గ్రాముల ప్యాకెట్, 11 గ్రాముల ప్యాకెట్‌లు లభ్యమయ్యాయి. దీంతో అతడిని అదుపులోనికి తీసుకొని కేసు నమోదు చేశారు.